క్లుప్తంగా

'స్పందన'కు ఎనిమిది దరఖాస్తులు

తెనాలి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు ఎనిమిది అర్జీల్ని సమర్పించారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ వాటిని స్వీకరించారు. అర్జీదారుల్ని స్వయంగా పలకరించి, వారి సమస్యల్ని తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): వ్యవసాయ సబ్సిడీ పథకాలను రైతులు వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా సోమవారం ఏట్రవారిపాలెం సచివాలయం వద్ద రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా తైవాన్ స్ప్రేయర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ గ్రూపు రైతులకు సబ్సిడీలో ట్రాక్టరు, నాలుగు తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ పథకంలో బ్యాంకు రుణం 50శాతం, ప్రభుత్వ సబ్సిడీ 40శాతం పోను రైతులు 10శాతం నగదు చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చీరాల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి డి.పద్మావతి, నాయకులు చీరాల శ్రీనివాసరెడ్డి, గ్రామ వలంటీర్లు తదితరులు ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

చెరుకుపల్లి: పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని గుళ్లపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాస్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో గుళ్ళపల్లి గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామ సమీపంలోని కాల్వ కట్టపై నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద ఉన్న పేక ముక్కలను, రూ.1100ల నగదును స్వాధీనం చేసుకుని చెరుకుపల్లి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



నగరం: నగరం గ్రామానికి చెందిన సనకా వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నగదును సోమవారం కుటుంబ సభ్యులకు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అందించిన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, ఎంపీటీసీ ఉప్పాల వెంకటేశ్వరావు, వేల్ఫేర్ అసిస్టెంట్ కుందన పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళిక అధికారులపై లోకయుక్తాకు ఫిర్యాదు

మే 3న విచారణకు రావాలని ఆదేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులపై లోకాయుక్తాకు ఫిర్యాదు అందింది. దీనిపై మే 3న సంబంధింత వివరాలు అందజేయాలని(విచారణకు రావాలని) సోమవారం నోటీసులు జారీ చేసింది. నగరంలోని శ్యామల దాస్ అగ్రహారం కొత్తపేటకు చెందిన షేక్ షజాదీ తన స్థలంలో వేరే వ్యక్తి అక్రమంగా రేకుల షెడ్డు వేసుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఐదుసార్లు నగరపాలక సంస్థ గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. మున్సిపల్ సర్వేయర్ రిపోర్ట్‌లు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారులు న్యాయం చేయకపోగా ఏసీపీ షేక్ కాలేషా, టీపీఎస్ కోటయ్య, జీవీఎస్ మూర్తి ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారని షేక్ షజాదీ ఆరోపించారు. దీనిపై మరలా స్పందనలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు రేకుల షెడ్ తొలగిస్తామని, విడతల వారీగా నోటీసులు అందించి ఆ తరువాత తొలగిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు దీనిపై గత నెల 2న లోకయుక్తాకు ఫిర్యాదు చేయగా మే 3న విచారణకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించింది.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళాయపాలేనికి చెందిన పోకల లక్ష్మయ్య రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శ్రీరామ్‌నగర్ రోడ్డు వద్ద ఆటో ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా, 90 కేజీల బియ్యం దొరికింది. ఆటోను స్వాధీనం చేసుకుని, లక్ష్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహా యజ్ఞంలా పేదల ఇళ్ల నిర్మాణం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పెదరావూరు లే అవుట్‌లో అధికారులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణం తెనాలి నియోజకవర్గంలో మహా యజ్ఞంలా సాగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి తగినట్టుగా తెనాలిలో 27 వేల మందికి స్థలాల్ని పంపిణీ చేసి, ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణ పరిధిలోని పెదరావూరు, సిరిపురం, నేలపాడు జగనన్న కాలనీల్లోని లే అవుట్లను సోమవారం ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించారు. పర్యవేక్షకుల నేతృత్వంలో ఆయా లే అవుట్లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల్ని పరిశీలించారు. మున్సిపల్, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, పర్యవేక్షకుల్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అన్ని లే అవుట్ల వద్ద ఆర్చ్‌ల నిర్మాణం కోసం అనువైన ప్రదేశాన్ని గుర్తించారు. దగ్గరుండి మార్కింగ్ చేయించారు. వెంటనే ఆర్చ్‌ల నిర్మాణ పనులు ఆరంభం కావాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారుల్ని సమన్వయం చేసుకుంటూ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తున్నామని తెలిపారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడటం లేదని స్పష్టం చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని పేదలకు పర్యవేక్షకుల సహకారంతో తామే నిర్మించి ఇస్తున్నామని తెలియజేశారు. తన చేతులమీదుగా నియోజకవర్గంలోని 27 వేలమంది పేదలకు ఇళ్లనిర్మాణం ఒక ఘనమైన చరిత్రగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. అన్ని కాలనీల్లో రోడ్లు, కరెంటు, మంచినీరు వంటి మౌలిక వసతుల్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారనీ, కాలనీల్లో ఒక్కో సెంటు భూమి విలువ ఇప్పుడు రూ.10 లక్షలుగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జస్వంతరావు, డీఈఈ జాస్తి శివరామకృష్ణప్రసాద్, మండల పరిషత్ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, గృహనిర్మాణ సంస్థ డీఈ రఫీ, పర్యవేక్షకులు బొమ్ము నాగిరెడ్డి, గోపాలం శరత్‌బాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టండి



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు

కొల్లిపర: లబ్ధిదారులంతా జగనన్న కాలనీల్లో వెంటనే ఇళ్ల నిర్మాణాల్ని చేపట్టాలని ఎంపీడీవో పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలల్లోని లబ్దిదారుల వద్దకు సోమవారం స్వయంగా అధికారులు వెళ్లి గృహ నిర్మాణాలపై వారికి అవగాహన కల్పించారు. కాలనీల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, నిర్మాణాలకు ఇస్తున్న ముడి సరుకు, బిల్లుల మంజూరు, డ్వాక్రా మహిళలకు ఇంటి నిర్మాణాలపై రుణాల మంజూరు గురించి వివరించారు.

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సీఐ వెంకట్రావుకు ఫిర్యాదు అందజేస్తున్న వైద్యులు

తెనాలి రూరల్: ప్రైవేటు వైద్యశాలలో సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వైద్యులు పోలీసుల్ని కోరారు. పట్టణ పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని ఓ వైద్యశాలకు అపస్మారకస్థితిలో ఉన్న ఓ పాపను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి తీసుకువచ్చారు. వైద్యం సరిగా చేయడంలేదని డ్యూటీలో ఉన్న డాక్టర్‌తో పాటు సిబ్బందిపై దౌర్జన్యం చేసి దాడి చేశారు. దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోటినాగయ్య, వైద్యులు టూ టౌన్ సీఐ ఎస్. వెంకట్రావును సోమవారం కలసి దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేశారు.

డాక్టర్ నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: నగరానికి చెందిన సీనియర్ స్పైయిన్ సర్జన్, మల్లికా స్పైయిన్ సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్‌బాబుకు అంతర్జాతీయ అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ వెయిట్ బేరింగ్ సొసైటీ నాలుగో అంతర్జాతీయ సదస్సు ఢిల్లీలో ఇటీవల నిర్వహించారు. ఇందులో స్టాండింగ్ ఎమ్మారైలో డాక్టర్ నరేష్‌బాబు చేసిన మూడు పరిశోధనలకు వెయిట్ బేరింగ్ సొసైటీ అవార్డును అందజేసింది. ఈ విషయాన్ని సోమవారం గుంటూరు కొత్తపేటలోని మల్లికా స్పైయిన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేష్‌బాబు వివరాలు వెల్లడించారు. కీ హోల్ సర్జరీ విధానంలో అతి చిన్న గాటుతో స్పైయినల్ ఫిక్సేషన్ చేసే సమయంలో ఎవరికి ఆపరేషన్ విజయవంతంగా చేయవచ్చనే విషయాన్ని నిల్చొని తీసే ఎమ్మారై ద్వారా తాను సమర్పించిన పరిశోధనకు అవార్డును అందజేశారని వివరించారు. నిల్చున్నప్పుడు, పడుకున్నప్పుడు వెన్నుపూసకు రక్త సరఫరా, కూర్చొని మెడ వంచి ఎమ్మారై తీయడం ద్వారా ఎలాంటి సమస్యలు నివారించవచ్చనే విషయాలపై తాను పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు. స్పెయిన్ దేశానికి చెందిన రేడియాలజిస్ట్ ప్రొఫెసర్ కాయ్ విలనోవా చేతుల మీదుగా అంతర్జాతీయ అవార్డును అందుకున్నట్లు డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ నరేష్‌బాబుకు గుంటూరుకు చెందిన సీనియర్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు, సీనియర్ సర్జన్ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, గుంటూరు బోన్ క్లబ్‌కు చెందిన పలువురు ఆర్థోపెడిక్ సర్జన్స్ సోమవారం అభినందనలు తెలిపారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక చేయూత



లక్ష్మీ ప్రశాంతికి ఆర్థిక సహాయం చేస్తున్న తిలక్ బాబు, రవిప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుపేద కుటుంబానికి చెందిన వైద్య విద్యార్థినికి సొసైటీ ఫర్ రూరల్ స్కాలర్స్ (ఎస్ఎఫ్ఆర్ఎస్) రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. విద్యానగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు మాట్లాడుతూ గుజ్జనగుండ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తున్న సిరికొండ సత్యనారాయణ కుమార్తె లక్ష్మీ ప్రశాంతికి ఏలూరులోని ఆశ్రమ్ మెడికల్ కళాశాలలో ఏ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వచ్చిందని తెలిపారు. ప్రైవేటు కళాశాల కావడంతో ఫీజులు, ఖర్చుల రూపంలో రూ.85వేల వరకు ఖర్చయ్యే పరిస్థితుల్లో తండ్రి సత్యనారాయణ నిస్సహాతను తెలుసుకున్న ఎస్ఎఫ్ఆర్ఎస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆలపాటి రవీంద్ర మొదటి విడతగా రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని సీఏవో రవిప్రసాద్, తిలక్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో 22 మంది విద్యార్థులకు రూ.నాలుగు లక్షలు, రెండో విడతలో ఆరుగురు విద్యార్థులకు 2.25 లక్షలు, మూడో విడతలో 11 మందికి రూ.రెండు లక్షలు చొప్పున అందజేసినట్లు వివరించారు. ఎన్నారై ఎడ్యుకేషనల్ సొసైటీలో చదువుతున్న మరో 18 మంది విద్యార్థులకు రూ.మూడు లక్షలు ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. పేదరికం కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేకపోతున్న విద్యార్థులు విద్యానగర్ 4వ లైనులోని సాయిబాబా మందిరం ఎదుట ఉన్న ఎస్ఎఫ్ఆర్ఎస్ సంస్థలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నాగేంద్రబోస్, లక్ష్మీ ప్రశాంతి తండ్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంగ్ల సాహిత్యానికి వన్నె తెచ్చిన విలియం వర్డ్స్‌వర్త్



హేమమాలిని రాణిని సత్కరిస్తున్న రామకృష్ణమూర్తి, ప్రసాద్, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంగ్ల సాహిత్యానికి విలియం వర్డ్స్‌వర్త్ వన్నె తెచ్చారని విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ హేమమాలిని రాణి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సుప్రసిద్ధ ఆంగ్ల కవి విలియం వర్డ్స్‌వర్త్ జయంతి సభ నిర్వహించారు. ఆంగ్ల శాఖ అధ్యక్షుడు డాక్టర్ అందె బాలశౌరి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హేమమాలిని వర్డ్స్‌వర్త్ రచనలు, జీవిత విశేషాల్ని వివరించారు. ఆయన ప్రకృతి పరంగా కవిత్వం రాసి రొమాంటిక్ కవిగా ఆంగ్ల సాహిత్యంలో స్థిర స్థానం సాధించాడని చెప్పారు. ఆయన్ను అనుసరించి ఎంతో మంది అద్భుతమైన రొమాంటిక్ కవిత్వం రాశారని తెలిపారు. అనంతరం ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణ మూర్తి, ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు చిలకా అరుణ, బ్యూలా రాణి, మేజర్ చుక్కా నవీన్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గా ప్రసాద్, ఈ. సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీలు బహూకరణ

భట్టిప్రోలు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌ఛార్జ్ విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సాఆర్) సోమవారం 6 కుర్చీలను అందచేశారు. కుర్చీలను అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసరావు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వాసవిక్లబ్, సత్యసాయి బాబా ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఐలవరం విద్యార్థులు

ఐలవరం(భట్టిప్రోలు): మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం వియత్నాంలోని హోచీమింగ్ సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ కానెన్సరెన్స్‌కు వర్చువల్‌గా హాజరయ్యారు. సుమారు 8 దేశాలు పాల్గొన్న ఈ కాన్ఫరెన్స్‌కు భారతదేశం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం విద్యార్థులు ప్రాతినిథ్యం వహించారు. ఈ సందర్భంగా ఐలవరం విద్యార్థులు ఏపీలోని నూతన విద్యా సంస్కరణలు, తమ పాఠశాలలో అవలంబిస్తున్న వినూత్న కార్యక్రమాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమానికి మలేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, కంబోడియా, జపాన్, సౌత్‌కొరియా, శ్రీలంక దేశాలు వారి విద్యా రంగంలో వస్తున్న మార్పులను గూర్చి వివరించారు. వియత్నాం దేశంలోని విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి 500ల మందికి పైగా విద్యా శాఖాధికారులు హాజరయ్యారు. ఐలవరం విద్యార్థులు రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చాలా మందిని ఆకర్షించడమే కాక ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ మిగిలిన దేశాల ఉపాధ్యాయులు పాల్గొని వారి దేశాలలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను వివరించారు.

ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



నెహ్రూనగర్: రంజాన్ పండుగ రోజున ప్రార్థనలు జరుపుకొనే ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో పాటు మౌలిక సదుపాయాల్ని కల్పించాలని కోరుతూ సోమవారం అంజుమన్ కమిటీ సభ్యులు మేయర్ కావటికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ వద్ద ఉన్న ఉర్దూ బాయ్స్ పాఠశాలతో పాటు పొన్నూరు రోడ్డులోని బీఈడీ కళాశాల వద్ద ఈద్గాతో పాటు నగరంపాలెం రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా ఈద్గాలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, జంగల్ క్లియరెన్స్, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మహమూద్, ఖాజా మొహిద్దీన్ చిష్టి, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ సయ్యద్ అబ్దుల్ సలాం, డైరెక్టర్ హిదాయత్, కమిటీ సభ్యులు మస్తాన్ షరీఫ్, షారూఖ్, బాబు, ఖాజా పాల్గొన్నారు.

డాక్టర్ రోహితకు ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు



గుంటూరు మెడికల్: నగరానికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చిటితోటి రోహితకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ట్రస్టు ఇంటర్నేషనల్ సంస్థ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును అందజేసింది. డాక్టర్ రోహిత చిత్తశుద్ధితో చేస్తున్న ఉత్తమ వైద్య సేవలకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమె మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ రోహితకు రేడియాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిటితోటి కిశోర్‌కుమార్, గుంటూరుకు చెందిన పలువురు రేడియాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు సోమవారం అభినందనలు తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి అపూర్వ స్పందన



39వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రభాకర్

తెనాలి అర్బన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి తెనాలిలో సోమవారం విశేష స్పందన లభించింది. పట్టణంలోని దాదాపు అన్ని వార్డులో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించారు. 39వ వార్డులో కౌన్సిలర్ గెద్దేటి ఝాన్సీవాణి ఆధ్వర్యంలో వార్డులోని ప్రతి ఇంటికీ నేతలు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేసి, వారి అభిప్రాయాన్ని సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వార్డు నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు. 38వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లతో కౌన్సిలర్ వీర్ల పాటి విజయలక్ష్మి ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. మూడో వార్డులో కౌన్సిలర్ ఆవుల కోటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మీరావలి, 19వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుడు చుండూరు సాయిలు ప్రతి ఇంటికీ వెళ్లి బుక్‌లెట్లు అందజేశారు.

క్లారినెట్ విద్వాంసుడు శ్రీనివాస్‌కు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం బంగారు మనిషి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం కథానాయకుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం క్లారినెట్ విద్వాంసుడు కోడూరు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐతగోని గోపి, తురకారపు లక్ష్మీనారాయణ, కర్నాటి లక్ష్మయ్య, భీమనపల్లి సత్యం, కాటం సాంబయ్య, కాటం రవికుమార్, సోమవరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, పినపాటి రవీంద్ర, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్లటూరులో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన



వెల్లటూరులో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పాస్టర్లు, సంఘ పెద్దలు

వెల్లటూరు(భట్టిప్రోలు): మండల పరిధిలోని వెల్లటూరు శ్మశానవాటికకు చేరుకునేందుకు రూ. 10 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణ పనులను సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ శ్మశానవాటికకు చేరుకోవాలంటే నానాయాతనలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఐతే పడరాని తిప్పలు పడాల్సి వచ్చేది. దళితవాడ వాసుల చిరకాల కోరికను తీర్చేందుకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ముందుకు వచ్చారు. ఇందుకు రూ. 10 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేయించారు. వంతెన నిర్మాణ పనులకు పాస్టర్లు సీహెచ్ స్టీవెన్‌సన్, డేవిడ్ జె. జోసఫ్, ఫరీద్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు మేరుగ చలంబాబు, దాసరి రామారావు, చీకటి కోటేశ్వరరావు, దాసరి రామారావు, డొక్కా రామారావు, నున్నం ఆనంద్, పంచాయతీ రాజ్ ఎఈ కె. శేతు రామచంద్రరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె. అనిల్ పాల్గొన్నారు.

హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ విధానం

తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు



హోర్డింగ్స్‌కు క్యూఆర్ కోడ్ అమరుస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు

నెహ్రూనగర్: నగరంలోని హోర్డింగ్స్ విధానం పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి ప్రకటన బోర్డ్ నగరపాలక సంస్థకు ఫీజులు చెల్లించేలా సమగ్ర క్యూఆర్ కోడ్ విధానాన్ని సోమవారం పట్టణ ప్రణాళిక అధికారులు తొలి విడతగా బ్రాడీపేటలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తొలి విడతగా బకాయిలు చెల్లించిన వారి బోర్డులకు కోడ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇక నుంచి కోడ్ లేని బోర్డుల్ని తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని చెప్పారు. బోర్డులకు ఏర్పాటు చేసే కోడ్‌లను మరొక చోట ఏర్పాటు చేయడానికి వీల్లేకుండా లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లో లోకేషన్ కేటాయింపు ఉంటుదని పేర్కొన్నారు. నగరంలో అన్ని యాడ్ ఏజన్సీలు, వ్యక్తిగత బోర్డులు కలిగిన వారు తప్పనిసరిగా బకాయిలు చెల్లించి క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీ బాబూరావు, టీపీఎస్‌లు సువర్ణ కుమార్, హృదయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూపేష్ మక్వానాకు ఘన స్వాగతం



రూపేష్ మక్వానాకు అభినందనలు తెలియజేస్తున్న ఏబీవీపీ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్: రన్ ఫర్ సేవ్ యూత్–సేవ్ నేషన్ నినాదంతో 95 రోజుల్లో ఆరువేల కిలోమీటర్ల పరుగు చేపట్టిన గుజరాత్ వాసి రూపేష్ మక్వానా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. మిర్చి యార్డు రోడ్డులోని ఓ హోటల్లో సోమవారం సాయంత్రం రూపేష్ మక్వానాను కలిసిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి. సాయిచరణ్ గుప్తా మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ప్రారంభించిన పరుగు తిరిగి ఢిల్లీకి చేరుకునే లక్ష్యంతో రోజుకు 70 కిలోమీటర్లకు పైగా రూపేష్ మక్వానా పయనిస్తూ మార్గమధ్యంలో గుంటూరుకు వచ్చారని చెప్పారు. ఆగిన చోటల్లా గ్రామాలు, నగరాల్లోని కళాశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతరాన్ని చైతన్య పర్చేందుకు ప్రయత్నిస్తూ, తలచుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకాన్ని వారిలో కలిగించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. యువతను ఉత్తేజపరచి, వారిలోని నైపుణ్యాల్ని వెలికితీయాలనే ఉద్దేశంతో తన విలువైన సమయాన్ని కేటాయించడం అభినందనీయమన్నారు. యువతరం రూపేష్ మక్వానా వంటి వ్యక్తుల్ని ఆదర్శంగా తీసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దివాకర్, నగర కార్యదర్శి శ్రీకాంత్, ఉదయ్, కార్తీక్ పాల్గొన్నారు.

కొత్తపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ సోమవారం కొత్తపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసర ప్రాంతాల్ని పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్ఓ శీలం శ్రీనివాసరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతోపాటు ఈస్ట్ డీఎస్పీ సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తెనాలి టౌన్, డోర్ నెం.20-37-1/1, కచర్లవారి వీధి, చినరావూరు, తెనాలి కాపుర్నుడు శ్రీ [illegible] జీవరత్నం(లేటు) గారి కుమారుడు [illegible] గారి వలన [illegible] తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు యొక్క తండ్రి గారు అయిన [illegible] జీవరత్నం గారికి సంబంధించిన ఖాళీ నెం.13, టీ.ఎస్.నెం.505లోని 801/3 చ.గ.ల ఖాళీ [illegible] స్థలము [illegible] ది.31-10-1988న [illegible] దస్తావేజు నెం.2075/1988, తేది.05-04-2023న ఉదయం 11 గంటల సమయంలో [illegible] కొత్తపేట [illegible] కోర్టు సమీపంలో [illegible] పోయినవి. [illegible] దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందజేయవలసినదిగా ప్రార్థించుచున్నాము.

ఎం.వి.భీమేశ్వర్ అడ్వకేట్, నాజరుపేట తెనాలి. సెల్ : 9133331157